ప్రజా
రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 306 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
శనివారం 07 జూన్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

జనగణన ఆలస్యం కేంద్రం పన్నుతున్న దుష్టపన్నాగమే:స్టాలిన్

కేంద్ర ప్రభుత్వం అన్ని లెక్కలు వేసుకొని కావాలనే జనగణన, నియోజకవర్గాల పునర్విభజనను ఆలస్యం చేస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు.

జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): దేశంలో జనాభా లెక్కింపు 2027 మార్చి 1 నుంచి జరగనుందని కేంద్ర అధికార వర్గాలు ఇటీవల వెల్లడించాయి. దీంతోపాటు కుల గణన కూడా నిర్వహించనున్నట్లు తెలిపాయి. ఈవిషయంపై తమిళనాడు సీఎం ఎంకే. స్టాలిన్ స్పందిస్తూ.. కేంద్రప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కేంద్రప్రభుత్వం అన్ని లెక్కలు వేసుకొని కావాలనే జనగణన, నియోజకవర్గాల పునర్విభజనను ఆలస్యం చేస్తోందని ధ్వజమెత్తారు. జనగణన ఆలస్యం దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం పన్నుతున్న దుష్టపన్నాగమేనని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల హక్కులను నిర్వీర్యం చేస్తోందని స్టాలిన్ విమర్శించారు. జనగణన ఆలస్యం అప్పటికప్పుడు తీసుకొన్న నిర్ణయం కాదని.. నియోజకవర్గాల పునర్విభజన ప్రణాళిక యాదృచ్ఛికం కాదని వ్యాఖ్యానించారు. పునర్విభజన వల్ల ప్రస్తుతం ఉన్న 543 లోక్సభ నియోజకవర్గాల సంఖ్య కొనసాగినా.. 848కి పెంచినా జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందని పునరుద్ఘాటించారు. ఇది తమిళనాడుకు మాత్రమే కాకుండా దక్షిణాది రాష్ట్రాలకు ప్రమాదకరమని పేర్కొన్నారు. దీనివల్ల ప్రభావితమయ్యే రాష్ట్రాల డిమాండ్లను పరిష్కరిస్తామని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రకటించినప్పటికీ అవి అస్పష్టమైన వ్యాఖ్యలుగానే మిగిలిపోయాయని స్టాలిన్ అన్నారు. జమ్మూకశ్మీర్కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని అక్కడి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ అది కేంద్ర పాలిత ప్రాంతంగానే మిగిలిపోయిందని అన్నారు. కశ్మీర్లో ఎన్నికలు జరిగినా, రాష్ట్ర హోదా విషయంలో సుప్రీంలో హామీలు ఇచ్చినా ఏమీ లాభం లేకుండా పోయిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనను చేపడితే దేశంలో ప్రజాస్వామ్య శక్తి బలహీనం అవుతుందని స్టాలిన్ హెచ్చరించారు. దీనివల్ల భవిషత్తులో దక్షిణాది రాష్ట్రాలకు ముప్పు వచ్చే అవకాశం ఉందన్నారు. అన్నాడీఎంకే వంటి పార్టీల ద్రోహులు తమ రాజకీయ మనుగడ కోసం భాజపా ముందు మోకరిల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారు ఎన్ని కుట్రలు పన్నుతున్నప్పటికీ డీఎంకే నేతృత్వంలోని తమిళనాడు ప్రజలు రాష్ట్ర పురోగతిని అడ్డుకోవడాన్ని ఎప్పటికీ ఉపేక్షించరని అన్నారు. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరిసారి 2011లో దీన్ని నిర్వహించారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపైనా స్పష్టత లేకుండా పోయింది. 16 ఏళ్ల తర్వాత తొలిసారి 2027 మార్చి 1న జనాభా గణన నిర్వహించనున్నట్లు ఇటీవల కేంద్ర అధికార వర్గాలు వెల్లడించాయి.

రాబోయే రెండేళ్లలో 10 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ:సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలమైన ఏఐ వ్యవస్థ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.



అమరావతి, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలమైన ఏఐ వ్యవస్థ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఎన్విడియాతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈ సంస్థ మద్దుతులో నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో 10 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. ఏపీ నుంచి 500 ఏఐ స్టార్టప్ల ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. విద్య, నైపుణ్యం నుంచి పరిశోధన, ఆవిష్కరణ వరకు ఏపీ పునాది వేస్తోందని చంద్రబాబు వివరించారు.

అందుకే కాళేశ్వరం ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాం:హరీశ్ రావు

కాళేశ్వరం ప్రాజెక్టులోకి మేడిగడ్డ బ్యారేజీలో 2 పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టు కూలినట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్ రావు అన్నారు.

హైదరాబాద్, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్):మేడిగడ్డ బ్యారేజీలో 2 పిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు కూలినట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆయన తెలంగాణ భవన్లో పవర్పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మొత్తంగా ప్రాజెక్టు ద్వారా 20.33 లక్షల ఎకరాలకు నీరు అందించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మహారాష్ట్ర అభ్యంతరం చెప్పకుండా చర్చలు జరిపామని, ప్రభుత్వం ఏర్పడిన 45 రోజులకే మహారాష్ట్రకు వెళ్లి చర్చించి ఒప్పించామన్నారు.



"కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్స్టేషన్లు, 21 పంప్ హౌస్లు, 203 కి.మీ సొరంగాలు, 1,531 కి.మీ గ్రావిటీ కాలువలు, 98 కి. మీ ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజీ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు నీటి ఎత్తిపోతలు. తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీరు ఎత్తిపోసేలా మొదట రూపకల్పన చేశారు. తమ్మిడిహట్టి వద్ద నీళ్లు తక్కువ ఉంటాయని ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాం. మేడిగడ్డ బ్యారేజీని 7 బ్లాకులుగా 85 పియర్లుగా నిర్మించారు. కాళేశ్వరం లేకుండా పంటలు పండాయని కాంగ్రెస్ చెబుతోంది. ఈ ప్రాజెక్టు వల్లనే యాసంగిలోనూ పంటలు పండాయి. ఈ ప్రాజెక్టుకు 3 వనరుల ద్వారా నీటి లభ్యత ఉంది. ఆ నీటితో వేలాది చెరువులు నింపొచ్చు. మేడిగడ్డ నుంచి మల్లన్న సాగర్ వరకు నిర్మించినవన్నీ వాడకంలోనే ఉన్నాయి. కాళేశ్వరం కింద కాలువ ద్వారానే 90 వేల ఎకరాలకు నీరు అందించొచ్చు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు గోదావరి జలాల్లో 940 టీఎంసీలు కేటాయించారు. తెలంగాణ గోదావరి జలాలను ఏనాడూ 400 టీఎంసీలకు మించి వాడుకోలేదు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగేళ్లలో అనుమతులు కూడా సాధించలేదు. ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించకుండానే కాలువల తవ్వకం పనులు చేపట్టారు. 2007లో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు వ్యయాన్ని రూ.17 వేల కోట్లుగా చెప్పారు. ప్రాజెక్టు ప్రారంభించకముందే 2011నాటికి అంచనా వ్యయాన్ని రూ.40 వేల కోట్లకు పెంచారు" అని హరీశ్రావు అన్నారు.

మ్యాచ్ ఫిక్సింగ్ అంటూ రాహుల్ గాంధీ పోస్టు.. తీవ్రంగా స్పందించిన భాజపా

మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం సాధించేందుకు భాజపా మ్యాచ్ ఫిక్సింగ్కు పాల్పడిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): మహారాష్ట్రలో భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కమలం పార్టీ మ్యాచ్ ఫిక్సింగ్కు పాల్పడిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య రిగ్గింగ్కు ఆ ఎన్నికలు ఓ ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. బిహార్ లోనూ అదే పరిస్థితి పునరావృతం అవుతుందని విమర్శించారు. దీనిపై భాజపా కౌంటర్ ఇచ్చింది.

పవన్ను దూషించిన కేసు.. పోలీసుల అదుపులో యువకుడు

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ను దూషించిన కేసులో ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నరసరావుపేట, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ను దూషించిన కేసులో ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నరసరావుపేట మండలం ములకలూరుకు చెందిన షేక్ ఇర్ఫాన్ను నరసరావుపేట గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక జనసేన నేత లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఐసీయూలో రోగిపై అత్యాచారం...

రాజస్థాన్లోని ఓ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్న ఓ మహిళపై నర్సింగ్ సిబ్బంది ఒకరు అత్యాచారానికి పాల్పడ్డాడు.



జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్):రాజస్థాన్లో అమానుష ఘటన చోటుచేసుకుంది. ఐసీయూలో చికిత్స పొందుతున్న ఓ మహిళపై అక్కడి నర్సింగ్ స్టాఫ్ అత్యాచారానికి పాల్పడ్డాడు. బుధవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ఓ మహిళ (32) ఐసీయూలో చికిత్స పొందుతుండగా, ఆమె కుటుంబసభ్యులు వార్డు బయట వేచి ఉన్నారు.

ఈ క్రమంలోనే నర్సింగ్ సిబ్బంది ఒకరు ఐసీయూలోకి వచ్చి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనికి ముందు ఆ మహిళ బెడ్ చుట్టూ కర్టెన్లు వేసి బాధితురాలికి మత్తుమందు ఇచ్చాడు. ఈక్రమంలో బాధితురాలు కొంచెం స్పృహలో ఉండటంతో తన కుటుంబసభ్యులను పిలిచేందుకు ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా పోయింది. ఆమె స్పృహలోకి వచ్చాక కుటుంబసభ్యులకు జరిగిన విషయం తెలియజేసింది. కాగా.. బాధితురాలి భర్త ఆస్పత్రి సిబ్బందిని నిలదీయగా.. వారు దాన్ని ఖండించారు. ఆ వెంటనే దీనిపై కేసు నమోదు చేశారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించిన అధికారులు ఆమె వాంగ్మూలం కూడా రికార్డు చేశారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇక, ఈ ఘటనపై విచారణ కమిటీని ఏర్పాటుచేస్తామని ఆస్పత్రి అధికారి ఒకరు పేర్కొన్నారు. తప్పు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

భార్యను చంపాలనుకొని మరో మహిళపై దాడి

భార్యను చంపాలనుకొని మరో మహిళపై వ్యక్తి దాడి చేసిన ఘటన మైలార్దేవ్పల్లి పరిధి కాటేదాన్లో చోటుచేసుకుంది.

హైదరాబాద్, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): భార్యను చంపాలనుకొని మరో మహిళపై వ్యక్తి దాడి చేసిన ఘటన మైలార్దేవ్పల్లి పరిధి కాటేదాన్లో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి తాగిన మైకంలో సలీమ్ అనే వ్యక్తి తన ఇల్లు అనుకొని పక్కింట్లోకి వెళ్లి నిద్రిస్తున్న మహిళను కత్తితో పొడిచాడు.



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్కు చెందిన సలీమ్ దంపతులు మూడేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. సలీమ్ అతని భార్య మున్ని మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. వీరి పక్కింట్లో అబేదా(25) ఉంటుంది. శుక్రవారం అర్ధరాత్రి మద్యం మత్తులో పక్కింట్లోకి వెళ్లిన సలీమ్.. తన భార్య అనుకొని అబేదాపై కత్తితో దాడి చేశాడు. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. మైలార్దేవ్పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడి చేసి పరారైన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

పార్టీ, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఎవరినైనా వదులుకుంటాం: సీఎం చంద్రబాబు

ఏడాదిలో స్పష్టమైన మార్పు చూపించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. తెదేపా నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్లో ఆయన మాట్లాడారు.



అమరావతి, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రాభివృద్ధిలో ఏడాది కాలంలో స్పష్టమైన మార్పు చూపించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. తెదేపా నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్లో ఆయన మాట్లాడారు. అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. "పార్టీలో ప్రతి ఒక్కరి పనితీరుపై సర్వేలు చేయిస్తున్నాం. బాగా పనిచేసిన వారికి ప్రోత్సాహం ఉంటుంది. పార్టీ, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఎవరినైనా వదులుకుంటాం. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలి. ప్రజలు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలి. వన్నెమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది నా ఆలోచన.

ప్రజలు అన్నీ గమనిస్తారు.. జాగ్రత్తగా ఉండాలి గత ప్రభుత్వంలో రాష్ట్రమంతా నిరాశ, నిస్పృహ, చీకటి అలముకుంది. భయంకర పరిస్థితులను రాష్ట్ర ప్రజలు చూశారు. రాష్ట్రం పేరు వింటేనే దగ్గరకు వచ్చే పరిస్థితి లేకుండా చేశారు. అసమర్థ పాలనతో ఏపీని ఆర్థికంగా పాతాళానికి తొక్కేశారు. మనం తీసుకునే నిర్ణయాలతోనే మంచి ఫలితాలు వస్తున్నాయి. గత ప్రభుత్వాన్ని భరించలేకే ప్రజలు ఏకపక్షంగా మనల్ని గెలిపించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు, నివేదికలు ఉంటాయి. మంచి చేస్తే అభినందిస్తా.. తప్పు చేస్తే దూరం పెడతా. త్వరలోనే ఒక్కో ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహిస్తా. ఎవరు ఎంత అడ్డుపడినా రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞం ఆగదు. ఈ నెల 12 లేదా 14 లోపే తల్లికి వందనం నగదు తల్లులకు అందిస్తాం" చంద్రబాబు తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్లో ఏడాది పాలనపై 12న నియోజకవర్గాల్లో విజయోత్సవ ర్యాలీలు చేయాలని నిర్ణయించారు. అదే రోజున సాయంత్రం ఎన్డీయే పక్షాలు, అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహించనున్నారు. వచ్చే నాలుగేళ్లలో చేపట్టే కార్యక్రమాలపై ఇక్కడ చర్చించనున్నారు.

జగన్ మాటలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది: యనమల

ప్రజాస్వామ్యంలో నియంత పాత్ర పోషించి, గత ప్రభుత్వంలో పాలనను జగన్ పూర్తిగా దెబ్బతీశాడని తెలుగుదేశం సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ధ్వజమెత్తారు.

అమరావతి, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): ప్రజాస్వామ్యంలో నియంత పాత్ర పోషించి, గత ప్రభుత్వంలో పాలనను జగన్ పూర్తిగా దెబ్బతీశాడని తెలుగుదేశం సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ధ్వజమెత్తారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. జగన్ వైఫల్యాలంటూ కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. ఇలా మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని దుయ్యబట్టారు. విమర్శించడం ప్రతిపక్ష నాయకుల హక్కు అన్నారు. కానీ వాస్తవికత లేని విమర్శలను నాయకుల కంటే ప్రజలు బాగా గ్రహిస్తారని వివరించారు.

తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్

తెలంగాణ మంత్రి వర్గ విస్తరణపై నిరీక్షణకు తెరపడింది. కేబినెట్ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదివారం మంత్రి వర్గ విస్తరణ ఉండే అవకాశముంది.

హైదరాబాద్, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై నిరీక్షణకు తెరపడింది. కేబినెట్ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదివారం మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశముంది. కొత్తగా ముగ్గురు లేదా నలుగురికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి మంతనాలు సాగిస్తున్నారు. ఎవరెవరికి ఏయే శాఖలు కేటాయించాలి? సామాజిక వర్గాల సమీకరణ ఎలా ఉండాలన్న దానిపై చర్చిస్తున్నారు. పార్టీ ఇన్ఛార్జి మీనాక్షి నటరాజన్తో పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్, సీఎం రేవంత్రెడ్డి ఇప్పటికే చర్చలు పూర్తి చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

నవనందుల కోట మహానందిలో యోగాంధ్ర కార్యక్రమాలు

సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ యోగాభ్యాసనాలు వేయండి

-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మహానంది/నంద్యాల, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేసి సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంతతను అలవర్చుకుంటూ యోగాను మన దైనందిన జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పిలుపునిచ్చారు. శనివారం మహానంది పుణ్యక్షేత్ర ప్రాంగణంలో 2000 మందిచే నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ లు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఊరు వాడా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేసి సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంతతను అలవర్చుకోవాలన్నారు. యోగాను మన దైనందన జీవితంలో భాగస్వామ్యం చేసుకోవడానికి "యోగా ఫర్ వన్ ఎర్త్ - వన్ హెల్త్" అనే నినాదంతో యోగా మాసోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా అనేక రుగ్మతలను దూరం చేసుకునేందుకు వీలుంటుందని కలెక్టర్ తెలిపారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలనేదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని అందులో ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన శ్రీశైల దివ్యక్షేత్రంలో, మహానంది, అహోబిలం, బెలుం గుహలు, పచ్చర్ల జంగిల్ క్యాంప్ లో యోగా కార్యక్రమాలు నిర్వహించుకునేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న మాస్టర్ ట్రైనర్స్ లచే జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున 8 లక్షల మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేలా శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శారీరికంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండడానికి మన జీవన విధానంలో యోగాను నిత్య కృత్యం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎంతో అనుభవజ్ఞులైన యోగ గురువులు ఉన్నారని అందులో మొదటి (కర్టెన్ రైజర్స్) రోజున నేచర్ క్యూర్, శ్రీశైలంలో పతాంజలి టీమ్, మహానంది క్షేత్రంలో రామచంద్ర మిషన్ కు చెందిన యోగ గురువుల ద్వారా సాధన చేయడం జరిగిందని కొత్తగా యోగ చేసే వారికి కూడా ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేయడానికి కృషిచేసిన జాయింట్ కలెక్టర్, మహానంది దేవస్థానం సిబ్బంది, జిల్లా అధికారులకు యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని కలెక్టర్ అభినందించారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజులపాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా యోగానంద కార్యక్రమాలతో పాటు గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో మూడు కేటగిరీలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహానంది ఆలయ ప్రాంగణంలో ఎంత పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

రైల్వే బ్రిడ్జి, రైల్వే లైన్లులను ఏర్పాటు చేయండి 2

మంత్రాలయం జూన్7, (రిపబ్లిక్ న్యూస్): భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు గత నాలుగు సంవత్సరాలు ముందు కరోనా రావడంతో కోసిగిలో రైల్వే స్టేషన్లో నిలబడే రైళ్లు రద్దు చేయడం జరిగింది రద్దు అయిన అప్పటినుండి ఇప్పటివరకు చాలామంది ప్రయాణం చేసే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు ఆర్టీసీ బస్టాండ్ లో సిపిఐ కోసిగి మండల సమితి ఆధ్వరంలో గతంలోనూ స్టేషన్లో నిలబడే బండ్లను మళ్లీ ప్రారంభించాలని సంతకాలు సేకరణ చేపట్టడం జరిగింది సిపిఐ మండల కార్యదర్శి (యం. గోపాల్) డిహెచ్పిఎస్ జిల్లా నాయకులు ఓంకార్ స్వామి మాట్లాడుతూ దేశం మొత్తం మీద చాలా వెనుకబడినది ఈ మండలం నిరక్షరాస్యత దేశంలోనే చిట్ట చివర ఉన్నదని పార్లమెంట్ లోనే తెలిపినారు కోసిగి అభివృద్ధి కావాలంటే ఈ క్రింద కనబరిచిన విషయాలు చర్చించుకోవాలి మంత్రాలయం నుండి కర్నూలుకు రైల్వే లైన్ వేయాలని సర్వే చేసిన కూడా నోచుకోలేదు ఎందుకంటే మంత్రాలయం నుండి కర్నూల్ మీదగా సర్వే చేసినారు అది వంకర తింగరగా ఉన్నది. కావున వెనుకబడిన కోసిగి మండలం కూడా అభివృద్ధి చెందుతాయి.కరోనాకముందు ఉన్న గుల్బర్గా ప్యాసింజర్ కొల్లాపూర్ ఎక్స్ప్రెస్ ట్రైన్స్ మరల నడపాలి. రైచూర్ నుండి కోసిగి నందు స్టాపింగ్ ఇవ్వాలి కోసిగి నుండి ముంబై తిరుపతికి ప్రతిరోజు ప్రయాణము చేయువారు ఆదోనికి కానీ మంత్రాలయం గానీ వెళ్లాలి. పూణే కన్యాకుమారి ట్రైన్స్ బెంగళూరు వెళ్లే ఉద్యాన రైళ్లు కోసిగి నందు స్టాపింగ్ ఇవ్వాలి. అత్యవసరంగా వేయాలి గేటు పడితే అటు ఇటు కొన్ని వందల వాహనాలు నిలబడతాయి చాలామంది బస్సు ప్రయాణంగానే ఆటో ప్రయాణంగానే టూ వీలర్స్ కానీ అదేవిధంగా గర్భిణులకు కానీ అత్యవసరంగా పోవాలంటే చాలా ఇబ్బందికి గురవుతున్నారు అందుకు తొందరగానే రైల్వే బ్రిడ్జి ని నిర్మించాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రైతు సంఘం నాయకుడు నరసింహులు, ఆటో డ్రైవర్లు వివిధ ప్రయాణికులు హాజరు కావడం జరిగింది.

10న విజయవాడలో జాబ్ మేళా

విజయవాడ ప్రతినిధి, జూన్ 7 (రిపబ్లిక్ న్యూస్): శిక్షణ శాఖ ఆధ్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను10వ తేది మంగళవారం విజయవాడలోని వరుణ్ మోటార్స్ షోరూం నందు "జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్య బ్రహ్మం తెలియజేసారు. ఈ జాబ్ మేళాలో, వరుణ్ బజాజ్ ,పద్మజ సుజుకి,వరుణ్ మారుతి, భారత్ బెంజ్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్య బ్రహ్మం తెలిపారు. ఈ కంపెనీ లలో గల ఉద్యోగాలకు ఐటిఐ,డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బి టెక్,పీజీ పూర్తిచేసిన 18 నుండి 30 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఎంపిక అయిన వారికి ఆసక్తికర వేతనముతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలవని, జూన్ 10న నిర్వహించబోయే జాబ్ మేళాకు హాజరయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి, తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా ఎన్.సిఎస్ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి, సదరు జాబ్ మేళాకు రెస్యూమ్ లతో లేదా బయోడేటా ఫారం లతో పాటు ఆధార్, పాన్ సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని, మరిన్ని వివరాలకు 9985444333,9885797222 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఈనెల 10 వరకు సచివాలయాల్లో ఆన్ లైన్ సేవలు బంద్

విజయవాడ ప్రతినిధి, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో మంగళవారం రాత్రి వరకు అన్ని రకాల ఆన్లైన్ సర్వీసులు నిలిచిపోనున్నట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ తెలిపింది. ఏపీ సేవ పోర్టల్ మైక్రోసాఫ్ట్ క్లౌడ్ నుంచి రాష్ట్ర డేటా సెంటర్ కు తరలిస్తున్న కారణంగా ఈ అంతరాయం కలగనున్నట్టు ఆ శాఖ డైరెక్టర్ ఎం. శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మీ సేవా కేంద్రాల్లో సైతం కొన్ని రకాల సేవలు నిలిచిపోతాయని వివరించారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, సమగ్ర ధ్రువీ కరణ పత్రం, భూమి మ్యుటేషన్లు, రేషన్ కార్డు ఇళ్ల స్థలాల పట్టాల దరఖాస్తులు వంటివి, వృద్ధాప్య ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రం, రెవెన్యూ, వాటర్ ట్యాక్స్, పట్టణ పరి పాలన సంబంధిత సేవలు, మత్స్యశాఖ సేవలు మీ-సేవలో సైతం అందుబాటులో ఉండవని వివరించారు. ఇతర ప్రభుత్వ సేవలు మాత్రం మీ-సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులు వెంటనే సీటును ఖరారు చేసుకోవాలి-మురళి కృష్ణ

విజయవాడ ప్రతినిధి, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు వెంటనే సీటును ఖరారు చేసుకోవాలని దా. బీఆర్ అంబేద్కర్ గురుకులాల సమన్వయ అధికారి ఎ.మురళి కృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు ఇటీవల 5వ తరగతి , ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు జరిగిన పరీక్షలలో ఉత్తమ ర్యాంకులు పొందిన వారికి ఎంపిక ప్రక్రియ జరుగుతోందని తెలియజేశారు. ఎంపికైనవారి రిజిస్టర్ మొబైల్ నెంబరుకు మెసేజ్ వచ్చిన వెంటనే ఆయా పాఠశాలకు, కళాశాలకు వెళ్లి సీటును ఖరారు చేసుకోవాలని తెలియజేశారు.

తప్పని సరిగా వారి గురించి

కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలి

విజయవాడ ప్రతినిధి, జూన్ 7 (రిపబ్లిక్ న్యూస్): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ఇతర పార్టీల నాయకులను టీడీపీలోకి జాయిన్ చేసుకునేముందు తప్పని సరిగా వారి గురించి కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలి. వారి గురించి పూర్తిగా కేంద్ర కార్యాలయం విచారణ చేసిన తర్వాత పార్టీ అనుమతితో వారిని పార్టీలోకి ఆహ్వానించాల్సి ఉంటుంది. ఈ విషయంను తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాలలో ఉన్నటువంటి నాయకులు అందరూ గమనించగలన్నారు.

త్యాగానికి, సత్యానికి ప్రతీక బక్రీద్ - సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట ప్రతినిధి, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): ముస్లింలు జరుపుకునే అత్యంత ముఖ్యమైన పండుగలో రంజాన్ తర్వాత బక్రీద్ ఒకటని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని జగ్గయ్యపేట నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ సత్తార్ శనివారం జగ్గయ్యపేట పట్టణంలోని ఉదయభాను నివాసం నందు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా ఉదయభాను గారు మాట్లాడుతూ ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగం,సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశం అన్నారు. వ్యక్తిగత స్వార్థాన్ని వీడి త్యాగాలకు సిద్ధపడినప్పుడే సమాజ హితం సాధ్యపడుతుందని తెలిపారు. ఈ బక్రీద్ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నాయకులు ఆలీ అస్గర్, అద్వకేటెడ్ సామినేని రాము, పుప్పాల భరత్ సాయి, గొర్రెపాటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగం, భక్తి, సహనంలకు ప్రతీక బక్రీద్ పండుగ

బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభ ప్రద్ పటేల్

వికారాబాద్, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): వికారాబాద్ జిల్లా పధిలోని తాండూరు పట్టణంలోని చెన్ గేష్ ఫూర్ రోడ్డు సమీపంలో గల ఈద్గాలో జరిగిన బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలో బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభ ప్రద్ పటేల్ పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం మత పెద్దలకు, ముస్లిం సోదరులకు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగం, భక్తి, సహనాలకు ప్రతీక అయిన బక్రీద్ పండుగ అందరు సుఖసంతోషాలతో జరుపుకోవాలని అన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి

ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 7(రిపబ్లిక్ న్యూస్): అర్హత కలిగిన బడిఈడు కలిగిన ప్రతి బాలబాలికను పాఠశాలలో చేర్చాలన్న సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఆదిలాబాద్ టీం శనివారం దుబార్పేట ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి, వారిని పాఠశాలలో చేర్పించాలని అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, రవికాంత్ రెడ్డి పాల్గొన్నారు. పలువురు తల్లిదండ్రులు, గ్రామస్తులు కార్యక్రమానికి సానుకూలంగా స్పందించారు.బడిబాట కార్యక్రమం ద్వారా అర్హత కలిగిన డ్రాపౌట్స్, అనాథలు, సెమి-అనాథలు, పట్టణ నిరుపేద కుటుంబాలకు చెందిన బాలబాలికలకు విద్యా అవకాశాలు కల్పించనున్నట్లు వారు తెలిపారు

దుష్ప్రచారం చేస్తే కఠినచర్యలు తప్పవు

మీడియా సమావేశంలో హెచ్చరించిన అదిలాబాద్ ఎంపీ జీ.నగేష్

ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్):జిల్లాల్లో కొంత మంది మిడియా వారు కావాలని తనపై తప్పుడు వార్తలు ప్రచురించడం ప్రసారం చేయడం సరైంది కాదని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత కొన్నీ రోజులుగా కొన్ని ఛానల్ లు వారి రేటింగ్ కొరకు అసత్య వార్తలు ప్రసరిస్తున్నాయని ఇంకోసారి అలా నిరాదరణ ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ వారి పాలనవైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని అలాంటి నాయకత్వంతో కలసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అలాంటిది నేనేదో బిజెపి కి షాక్ ఇస్తున్నా అని తప్పుడు వార్తలు వ్రాయడం సరి కాదని ఇంకోసారి అలా దుష్ప్రచారం చేస్తే వ్రాసిన వారికి చట్టరీత్య కఠిన చర్యలు చెప్పడతామణి అన్నారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పటిసి తాటిపెల్లి రాజు, క్రిష్ణ కుమార్, చంద్రకాంత్, వెంకటస్వామి,అరుణ్, సదానందం తదితరుల పాల్గొన్నారు.

బక్రీద్ వేడుకల్లో మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): మంత్రాలయం నియోజకవర్గం కోసిగి టౌన్ లోనే ఈరోజు బక్రీద్ పండుగ సందర్భంగా మంత్రాలయం నియోజకవర్గ టిడిపి బాద్యులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఈద్గాకు వెళ్లి ముస్లిమ్స్ అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. నిస్వార్థమైన త్యాగానికి నిలువెత్తు నిదర్శనం గా నిలిచిన ఇబ్రహీం చర్యను బక్రీద్ సందర్భంగా అందరూ మరోసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బక్రీద్ శాంతి,సహనం సమానత్వానికి ప్రతికగా నిలవాలంటూ, ప్రజలందరికీ బక్రీద్ అందరికీ ఆనందాలు పంచాలని ఆకాంక్షించారు.అలాగే కోసిగి టౌన్ టీడీపి నాయకులు ముత్తురెడ్డి , వక్రని వెంకటేష్, నాడిగేని అయ్యన్న, చింతగేని నర్సిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియచేసారు.

నూతన వస్త్ర బహుకరణ వేడుకలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి

నందిగామ ప్రతినిధి, జూన్ 7 (రిపబ్లిక్ న్యూస్): నందిగామ, బత్తుల గోపి - పావని దంపతుల కుమార్తెల నూతన వస్త్ర బహుకరణ వేడుకలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి పాల్గొన్నారు. శనివారం నాడు వారి స్వగృహము నందు జరిగిన కార్యక్రమంలో పాల్గొని శ్రావ్య, సంజనకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తోటకూర సూర్యనారాయణ పాల్గొన్నారు.

బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు

భగవంతుని పట్ల ప్రేమ, త్యాగానికి ప్రతీక బక్రీద్

నంద్యాల, జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అందులో భాగంగా నంద్యాలలోని భీమవరం వెళ్లే రోడ్డులోని ఈద్గా నందు ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా ఈద్గా ముత్తవల్లి మనియార్ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ ఈద్ నమాజ్ కోసం పెద్ద సంఖ్యలో ముస్లింలు ఈద్ కు ప్రజలు ఎక్కువ సంఖ్యలో ప్రార్థన నిర్వహించే నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారని ఎండాకాలం తీవ్రత దృష్ట్యా ప్రార్థనలకు వచ్చే ఎవరికి ఎలాంటి ఇబ్బందీ,లేకుండా అన్ని రకాల సహాయ సహకారాలను వసతిని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులందరితో మాట్లాడి సౌకర్యాలు ఏర్పాటు చేయడం పై మనియార్ ఖలీల్ అహ్మద్ సంతోషం వ్యక్తం చేశారు. అధికారులందరూ కూడా సహకారాలను అందించారని సరైన ఏర్పాట్లు చేశారని,పోలీసులు అధికారులు మంచి భద్రతను ఏర్పాటు చేసి సహకరించినందుకు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కు, అదేవిధంగా మాకు సహాయ సహకారాలలో భాగస్వామ్యం ఆయన అధికరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆదే గజేందర్



ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జూన్ 7, (రిపబ్లిక్ న్యూస్): నేరడిగొండ పట్టణ ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆదే గజేందర్ ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భక్తికి, త్యాగానికి, సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు ఆయనతో పాటు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆదే వసంత్ రావు, జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

ఆదిలాబాద్ జిల్లా ఎంపీ నగేష్

ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జూన్ 7,(రిపబ్లిక్ న్యూస్): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి నగేష్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యక్రమంలో 11 ఏళ్ల జిల్లా కర్యశాల కార్యక్రమంలో భాగంగా పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గతంలో ప్రధాని గా స్వర్గీయ వాజపేయి కాలంలో జాతీయరహదారులు రెండు వరసాలను 4 వరసలుగా మార్చడం జరిగిందని. గోదావరిఖని కరీంనగర్ రహదారి, బోరజ్ రోడ్డు, కేంద్రీయ విశ్వవిద్యాలయ భవనాలు, పాస్పోర్ట్ కార్యాలయం, ఇటీవల రైల్వే లైన్, ఎయిర్పోర్ట్ ఏర్పాటు కు అనుమతులు ఇవ్వడం జరిగిందని అన్నారు.కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ మనం చేపట్టే కార్యక్రమాలను వివరిస్తే వచ్చే స్థానిక సంస్థల్లో సత్తా చాటగలమని అన్నాడు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి యెండల లక్ష్మీనారాయణ , జిల్లా పార్టీ అధ్యక్షులు బ్రహ్మ నంద్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మాజీ జడ్పీటీసీ తాటి పెల్లి రాజు, జిల్లా మండల పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిన్నాపురం గ్రీన్ కో ప్రాజక్ట్ ను సందర్శించిన తెలంగాణ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

పాణ్యం ప్రతినిధి, మే,7, (రిపబ్లిక్ న్యూస్): స్థానిక మండలం,లోని పిన్నాపురంలోని గ్రీన్ కో పవర్ ప్రాజెక్ట్ సందర్శించడానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్రం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం భట్టి విక్రమార్క తో కలిసి ఎమ్మెల్యే గ్రీన్‌కో పవర్ ప్రాజెక్టును సందర్శించి, వివిధ విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పవర్ ప్రాజెక్టు నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం తదితర విషయాలను భట్టివిక్రమార్క గ్రీన్ కో సీఈవో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధికారులు, గ్రీన్‌కో ఇతర అధికారులు,సిబ్బందికూటమి నాయకులు పాల్గొన్నారు.

కాకినాడలో 7 వేల మందితో పెద్ద ఎత్తున యోగ

ఉత్సాహంగా యోగ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు యువత, మహిళలు, విద్యార్థులు ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలి. జిల్లా అంతటా యోగాంధ్రకు సంబందించిన అవగాహన కార్యక్రమాలు నిర్వహణ:జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగలి

కాకినాడ జిల్లా ప్రతినిధి, జూన్ 7,(రిపబ్లిక్ న్యూస్): వివిధ వృత్తులలో పని చేస్తున్న ప్రతి ఒక్కరు నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చని జిల్లా కలెక్టర్ షన్మోహన్ పేర్కొన్నారు. జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ప్రత్యేక యోగా కార్యక్రమం శనివారం కాకినాడ మెయిన్ రోడ్డు టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఎల్ఐసీ బిల్డింగ్ సెంటర్ వరకు నిర్వహించారు.ఈ యోగ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, కాకినాడ స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, అడిషనల్ ఎస్పీ మానిష్ పాటిల్ దేవరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట్రావు, పాడా పీడీ చైత్ర వర్షిణి, కాకినాడ ఆర్డీవోఎస్.మల్లిబాబులతో పాటు ఇతర శాఖల అధికారులు, 7 వేల మంది ఉపాధ్యాయులు హాజరై యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో గత నెల మే 21 నుంచి ఈ నెల 21 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నమన్నారు. జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి ఇప్పటివరకు 8.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ప్రకారం జిల్లాలో శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశా

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1893:** దక్షిణాఫ్రికాలో మహాత్మా గాంధీ మొట్టమొదటి సహాయ నిరాకరణ ఉద్యమం.
- **1896:** అమెరికన్ భౌతిక, రసాయన శాస్త్రవేత్త రాబర్ట్ శాండర్సన్ ముల్లికెన్ జననం (మ.1986).
- **1974:** భారత టెన్నిస్ క్రీడాకారుడు మహేష్ భూపతి జననం. (చిత్రంలో)
- **1979:** భారతదేశ ఉపగ్రహం భాస్కర-1 ప్రయోగించబడింది.
- **1991:** అగ్ని పర్వతం పినతూబో పేలి, 7 కి.మీ (4.5 మై) ఎత్తుకు బూడిద చిమ్మింది.
- **2002:** భారత రాజకీయ వేత్త, 5వ ఉప రాష్ట్రపతి బసప్ప దానప్ప జెట్టి మరణం (జ. 1912).
- **2011:** భారతదేశ నాట్యాచార్యుడు నటరాజ రామకృష్ణ మరణం (జ.1933).


మహాత్మాగాంధీ

రాబర్ట్ శాండర్సన్ ముల్లికెన్

మహేష్ భూపతి


భాస్కర-1

పినతూబో

బసప్ప దానప్ప జెట్టి

నటరాజ రామకృష్ణ

సమంత కొత్త వీడియో.. ఆ టాటూ గురించే నెటిజన్ల కామెంట్స్

ప్రస్తుతం అబుదాబీలో చిల్ అవుతున్నారు నటి సమంత. ఓ బ్రాండ్ ప్రమోషన్లో భాగంగా తాజాగా ఆమె షేర్ చేసిన వీడియో నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది.

నటి, నిర్మాతగానే కాకుండా పలు బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ ఫుల్ బిజీగా జీవితాన్ని గడుపుతున్నారు సమంత. 'సీక్రెట్ ఆల్కమిస్ట్' సంస్థ ప్రమోషన్లో భాగంగా శుక్రవారం ఆమె ఒక స్పెషల్ వీడియో షేర్ చేశారు. 'నథింగ్ టు హైడ్' అని పేర్కొంటూ ఇందులో ఆమె నవ్వులు పూయిస్తూ కనిపించారు. "ఇదొక మంచి ఉద్దేశంతో మొదలైంది" అనే క్యాప్షన్‌ను జత చేశారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ గా మారింది. దీనిని చూసిన పలువురు నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా ఆమె మెడపై టాటూ కనిపించకపోవడంపై వాళ్లు మాట్లాడుకుంటున్నారు. "వైఎంసీ (ఏమాయ చేసావె).. టాటూను సమంత తొలగించేశారా? " అని సందేహం వ్యక్తంచేశారు. అలా జరిగి ఉండకపోవచ్చని.. మేకప్ అది కనిపించకుండా కవర్ చేసి ఉండొచ్చని మరికొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సమంత కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన చిత్రమే 'ఏమాయ చేసావె'. గౌతమ్ వాసుదేవ్ మేనన్ దర్శకత్వం వహించిన ఈ ప్రేమకథా చిత్రం సామ్ను సినీప్రియులకు ఎంతగానో చేరువ చేసింది. తొలి చిత్రానికి గుర్తుగా సమంత తన మెడపై 'వైఎంసీ' అనే పచ్చబొట్టు వేయించుకున్నారు. ఇది తనకెంతో ప్రత్యేకమని ఆమె పలు సందర్భాల్లో చెప్పారు. సీక్రెట్ ఆల్కమిస్ట్ విషయానికి వస్తే.. ఇదొక బ్యూటీ, కాస్మొటిక్, పర్సనల్ కేర్ సంస్థ. ఈ సంస్థకు ఈమె సహ వ్యవస్థాపకురాలు. దీంతో ఈ బ్రాండ్ను ప్రమోట్ చేస్తూ సామ్ తరచూ వీడియోలు షేర్ చేస్తుంటారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. సమంత ప్రస్తుతం 'రక్త బ్రహ్మాండ్' సిరీస్ కోసం వర్క్ చేస్తున్నారు. రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆదిత్యరాయ్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. యాక్షన్ ఎంటర్టైనర్గా ఇది సిద్ధమవుతోంది. ఆమె నిర్మాతగా వ్యవహరించిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'శుభం' ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. తన నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్పై ఇప్పుడు ఆమె 'మా ఇంటి బంగారం' సినిమా చేయనున్నారు. సమంత కథానాయికగా ఇది సిద్ధం కానుంది.

అల్లు అర్జున్ - అట్లీ ప్రాజెక్ట్.. హీరోయిన్‌గా ఈమె ఫిక్స్

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ ప్రాజెక్ట్ సిద్ధం కానున్న విషయం తెలిసిందే. ఇందులో కథానాయికగా ఎవరు నటించనున్నారో టీమ్ తాజాగా ప్రకటించింది.

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ ప్రాజెక్టు సన్నాహాలు జరుగుతోన్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ పుట్టినరోజును పురస్కరించుకొని ఏప్రిల్ 8న టీమ్ దీనిని అధికారికంగా ప్రకటించింది. సన్ పిక్చర్స్ నిర్మాణసంస్థపై భారీ బడ్జెట్తో ఇది నిర్మితం కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, టీమ్ తాజాగా ఒక ఆసక్తికర ప్రకటన విడుదల చేసింది. ఇందులో హీరోయిన్గా ఎవరు కనిపించనున్నారో టీమ్ ప్రకటించింది. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె.. ఇందులో బన్నీకి జోడీగా కనిపించనున్నారని చెప్పింది. ఈ మేరకు స్పెషల్ వీడియో షేర్ చేసింది. 'పుష్ప' తర్వాత అల్లు అర్జున్ నటిస్తోన్న చిత్రమిదే. అల్లు అర్జున్ 22వ ప్రాజెక్ట్ ఇది ప్రచారంలో ఉంది. సమాంతర ప్రపంచం, పునర్జన్మల కాన్సెప్ట్ ముడిపడి ఉండే సైన్స్ఫిక్షన్ సినిమాగా ఇది ముస్తాబు కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికోసం చిత్రబృందం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించే పనిలో ఉంది. హాలీవుడ్కు చెందిన ఓ ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థ ఈ సినిమా కోసం రంగంలోకి దిగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ బడ్జెట్తో నిర్మితం కానున్న ఈ సినిమా ఈయేడాది ద్వితీయార్ధంలోనే చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. దీపికా పదుకొణె విషయానికి వస్తే.. బాలీవుడ్లో స్టార్ హీరోయిన్గా గుర్తింపు తెచ్చుకున్న ఆమె 'కల్కి 2898 ఏడీ'తో టాలీవుడ్లోకి అడుగుపెట్టారు. గతేడాది విడుదలైన ఆ చిత్రంతో తెలుగు సినీ ప్రియులను ఆకట్టుకున్నారు. తాజాగా సన్ పిక్చర్స్ విడుదల చేసిన వీడియోను చూస్తే.. ఏఏ22లో ఈమె పాత్ర విభిన్నంగా ఉండనుందని తెలుస్తోంది. దీపికపై యాక్షన్ సన్నివేశాలు సైతం చిత్రీకరించనున్నట్లు అర్థమవుతోంది.

'హరిహర వీరమల్లు' రూ.250 కోట్ల బడ్జెట్: జ్యోతికృష్ణ

పవన్ కల్యాణ్

హీరోగా రూపొందుతోన్న పీరియాడికల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'హరిహర వీరమల్లు'. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఉద్దేశించి దర్శకుడు జ్యోతికృష్ణ మచిలీపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. సినిమా బడ్జెట్ గురించి ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. సుమారు రూ.250 కోట్లకు పైగా బడ్జెట్తో దీనిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. "పవన్ కల్యాణ్ వర్క్ చేసే అవకాశం నాకు ఈ సినిమాతో దొరికింది. అదృష్టవంతుడిగా ఫీలవుతున్నా. ఇతరుల టాలెంట్ను ఆయన ఎంతగానో గుర్తిస్తారు. ఒక్కసారి నమ్మారంటే ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారు. ఆయన నన్ను నమ్మారు. నాతో సినిమా చేశారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నా. ఇప్పటికే ఆయన సినిమా చూశారు. అది కూడా ఒక్కసారి కాదు మూడుసార్లు. దాదాపు గంటసేపు నన్నెంతో మెచ్చుకున్నారు. నాతో మరో సినిమా చేయాలని ఉందని చెప్పారు. ఆయన మాటలు నాకెంతో ఆనందాన్ని ఇచ్చాయి. బందరు పోర్టు సంబంధించి మన సినిమాలో ఒక భారీ సీక్వెన్స్ ఉంది. కథకు తగిన విధంగా సీజీలో ఈ పోర్ట్ రీ క్రియేట్ చేయడానికి సుమారు రెండేళ్లు కష్టపడ్డాం. పోర్ట్ బ్యాక్రాప్లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్ను ప్రేక్షకులు ఫుల్ ఎంజాయ్ చేస్తారు. దీనికోసం ఆయన ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేశారు. మీకు మంచి చిత్రాన్ని ఇచ్చేందుకు ఆయన ఎంతో శ్రమించారు" అని జ్యోతికృష్ణ చెప్పారు. హిస్టారికల్ యాక్షన్ మూవీగా ఈ సినిమా సిద్ధమవుతోంది. నిధి అగర్వాల్ కథానాయిక. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. కీరవాణి స్వరాలు అందిస్తున్నారు. రెండు భాగాల్లో దీనిని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. జూన్ 12న దీనిని విడుదల చేయాలని భావించినప్పటికీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నామని శుక్రవారం టీమ్ ప్రకటించింది. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్ను ప్రకటిస్తామని చెప్పింది.

రిపబ్లిక్ ప్రజా పత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

తొక్కిసలాట ఘటన.. కర్ణాటక క్రికెట్ సంఘం సెక్రటరీ రాజీనామా

బెంగళూరు తొక్కిసలాట ఘటన నేపథ్యంలో కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం సెక్రటరీ రాజీనామా చేశారు.

బెంగళూరు: ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు పోలీసు అధికారులపై వేటుపడిన సంగతి తెలిసిందే. తాజాగా కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్సీఏ) కార్యదర్శి ఎ.శంకర్, కోశాధికారి ఇ.ఎస్. జైరాం తమ పదవులకు రాజీనామా చేశారు.

ఈ మేరకు శనివారం వీరు ఓ ప్రకటన విడుదల చేశారు. "గత రెండు, మూడు రోజులుగా ఊహించని, దురదృష్టకర ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇందులో మా పాత్ర పరిమితమైనదే అయినప్పటికీ.. నైతిక బాధ్యత వహిస్తూ మా పదవుల నుంచి వైదొలుగుతున్నాం. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడికి మా రాజీనామా లేఖలు పంపాం" అని శంకర్, జైరామ్ తమ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆర్సీబీ యాజమాన్యం, కేఎస్సీఏ అధ్యక్షుడు రఘురామ్ భట్, ఈవెంట్ మేనేజ్మెంట్ కంపెనీ డీఎన్ఏ ఎంటర్టైన్మెంట్ను బాధ్యులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ఇప్పటికే బెంగళూరు నగర కమిషనర్ బి. దయానంద్ను సస్పెండ్ చేయగా.. సీఎం సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శిని విధుల నుంచి తొలగించారు. మరికొందరు ఉన్నతాధికారులపైనా బదిలీ/సస్పెన్షన్ వేటు పడింది. ఇక, ఈ ఘటనకు సంబంధించిన ఆర్ సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సొసలెతో పాటు డీఎన్ఏ మేనేజ్మెంట్ ప్రతినిధులు సునీల్ మ్యాథ్యూ, కిరణ్, సుమంత్లను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు, తమపై నమోదైన కేసును రద్దు చేయాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంస్థ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని పోలీసులు, ప్రభుత్వానికి సూచించిన న్యాయస్థానం తదుపరి విచారణను 13వ తేదీకి వాయిదా వేసింది.

ఫ్యాషన్

ప్రతి ఒక్కరి అందంలో జుట్టు కీలకపాత్ర పోషిస్తుంది. ఇక, మగవారి లుక్లో హెయిర్ ప్రధానమైన బలం. పెళ్లి లేదా ఏదైనా ఫంక్షన్ కోసం మగవారు ఎన్ని రోజుల ముందు హెయిర్ కట్ చేయించుకోవాలో తెలుసా?

పెళ్లి రోజు ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత గుర్తుండిపోయే క్షణాలలో ఒకటి. ప్రతి ఒక్కరూ ఈ రోజును ప్రత్యేకంగా చేసుకోవాలని కోరుకుంటారు. వివాహ సన్నాహాలు కూడా నెలల ముందుగానే ప్రారంభమవుతాయి. ఇక, అమ్మాయి, అబ్బాయి పెళ్లిలో అందంగా కనబడటం కోసం చాలా తాపత్రాయపడుతుంటారు. పెళ్లిలో ఆకర్షణీయంగా కనిపించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ఇక, అమ్మాయిలకు అయితే స్పెషల్గా బ్యూటీ పార్లర్స్ లేదా మేకప్ కిట్స్ ఉంటాయి. కానీ, వరుడుకి ఇలాంటి సౌకర్యాలు అంతగా ఉండవు. ఇక, మగవారి లుక్లో జుట్టు ప్రధాన పాత్ర పోషిస్తుంది. కానీ, చాలా మంది మగవారికి హెయిర్ స్టైల్స్ గురించి అంతగా తెలియదు. దీంతో వారి లుక్ చెడిపోతుంది. పెళ్లి కోసం ఎన్ని రోజుల ముందు హెయిర్ కట్ చేయించుకోవాలో వరుడికి అంత క్లారిటీ ఉండదు. సాధారణంగా చాలా మంది అబ్బాయిలు సెలూన్కి వెళ్లి పెళ్లికి ఒకటి లేదా రెండు రోజుల ముందు హెయిర్ కట్ చేయించుకుంటారు. అయితే ఇది చాలా పెద్ద తప్పు. పెళ్లికి ఎన్ని రోజుల ముందు హెయిర్ కట్ చేసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఆ వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.

పెళ్లి లేదా ఏదైనా ఫంక్షన్‌కి మగవారు ఎన్ని రోజుల ముందు హెయిర్ కట్ చేయించుకోవాలో తెలుసా? హడావిడి పడితే లుక్ మొత్తం చెడిపోతుంది భయ్యా!



పెళ్లికి ఎన్ని రోజుల ముందు హెయిర్ కట్ చేయించుకోవాలి?

పెళ్లి లేదా నిశ్చితార్థం వంటి ప్రత్యేక కార్యక్రమానికి ముందు అబ్బాయిలు ఖచ్చితంగా హెయిర్ కట్ చేయించుకుంటారు. పురుషుల జుట్టు వేగంగా పెరుగుతుంది. దానిని సరైన ఆకారంలో ఉంచడం ముఖ్యం. చాలా మంది అబ్బాయిలు ఒకటి లేదా రెండు రోజుల ముందు జుట్టు కత్తిరించుకుంటారు. దీని వల్ల ముఖం మొత్తం లుక్ చెడిపోతుంది. మీరు త్వరలో వివాహం చేసుకుంటుంటే లేదా ఒక ప్రత్యేక కార్యక్రమానికి హాజరు కావాల్సి వస్తే, ఎన్ని రోజుల ముందు మీరు హెయిర్ కట్ చేయించుకోవాలో ఓ లుక్కేయండి.

పెళ్లికి 5-6 రోజుల ముందు



వరుడు తన పెళ్లి కోసం సరైన లుక్లో కనిపించడం చాలా ముఖ్యం. పెళ్లిలో అందరి ఫోకస్ వధూవరుల మీదే ఉంటుంది. అందుకే స్టైలిష్ లుక్లో కనిపించాలి. అందుకే హెయిర్ కట్ పెళ్లికి 5 నుంచి 6 రోజుల ముందుగానే చేయించుకోవాలి. హెయిర్ కట్ తర్వాత అది సరైన ఆకృతిలోకి రావడానికి కొంత సమయం పడుతుంది. కాబట్టి, ఒక వారం లేదా 6-7 రోజుల ముందుగానే హెయిర్ కట్ చేయించుకోండి.

వారం ముందు చేయించుకుంటే

మీరు ఒక వారం ముందుగానే హెయిర్ కట్ చేయించుకుంటే, అది సరైన ఆకృతిలోకి రావడానికి 4-5 రోజులు పడుతుంది. ఆ తర్వాత పెళ్లి రోజున అది పరిపూర్ణ ఆకృతిలో కనిపిస్తుంది. అలాగే, చాలా రోజుల ముందుగానే హెయిర్ కట్ చేయించుకోవడం వల్ల ఏదైనా తప్పులు ఉంటే.. ఫంక్షన్ ముందు సరిచేసుకునే సమయం ఉంటుంది. అదే ఒకటి రెండు రోజులు ముందు హెయిర్ కట్ చేయించుకుంటే అంత సమయం ఉండదు. చివరి నిమిషంలో హెయిర్ కట్ చేసుకోవడం వల్ల అనవసరమైన ఒత్తిడి పెరుగుతుంది. ముందుగానే ప్లాన్ చేసుకోవడం వల్ల మీరు రిలాక్స్ అవ్వగలరు.

ఈ విషయాలు ముఖ్యం



- జుట్టు పెరుగుదల వేగం: మీ జుట్టు ఎంత త్వరగా పెరుగుతుందో దానిపై కూడా ఆధారపడి ఉంటుంది. మీ జుట్టు వేగంగా పెరిగితే, ఈ వెంట్కు కొద్దిగా దగ్గరగా అంటే మూడు నుంచి ఐదు రోజుల ముందు కట్ చేసుకోవాల్సి వస్తుంది
- మీకు నమ్మకమైన బార్బర్ లేదా స్టైలిస్ట్ ఉంటే, వారితో మాట్లాడండి. జుట్టు రకం, స్టైల్, పెరుగుదల వేగం ఆధారంగా వారు మీకు సరైన సలహా ఇవ్వగలరు.
- మొదటి సారి స్టైల్ మారుస్తుంటే: మీరు పూర్తిగా కొత్త స్టైల్‌ను ప్రయత్నిస్తున్నట్లయితే, పెళ్లికి కనీసం 2-3 వారాల ముందు ఒకసారి కట్ చేయించుకుని, దానికి అలవాటు పడి.. చివరి టచ్-అప్ కోసం ఒక వారం ముందు మళ్ళీ వెళ్ళడం మంచిది.

హిందూ సాంప్రదాయం ప్రకారం

- కొంతమంది హిందూ సంప్రదాయాలను పాటించేవారు మంగళవారం, శనివారం, ఆదివారం జుట్టు కత్తిరించుకోకూడదని నమ్ముతారు. కాబట్టి, ఈవెంట్ సమయం బట్టి, ఈ రోజులను మినహాయించి సోమవారం, బుధవారం లేదా శుక్రవారం వంటి రోజులలో కట్ చేయించుకోవడానికి ప్లాన్ చేసుకోవచ్చు.
- ముఖ్యమైన చిట్కా: పెళ్లికి ఒక్క రోజు ముందు లేదా కార్యక్రమం రోజున ఉదయం హెయిర్ కట్ చేయించుకోవడం మంచిది కాదు. ఏదైనా అనుకోని విధంగా జుట్టు కట్ చేయడం లేదా అలర్జీలు వంటి సమస్యలు రావచ్చు. ఆ తర్వాత పెళ్లిలో మీ లుక్ అంతా చెడిపోతుంది.

గమనిక

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.